www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 ఏప్రిల్ 2023
5
అన్నమయ్య



తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : వైస్ ఎంపిపి



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి వెంకటరమణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైస్ ఎంపిపి వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో వైస్ ఎంపిపి వెంకటరమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా మండలంలో వడదెబ్బ పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎండకి బయట తిరగకూడదని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి సంపదను సృష్టించాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, జడ్పిటిసి నిర్మల, సర్పంచ్ గంగులమ్మ, వైస్ ఎంపిపి కిరణ్ కుమార్, సింగల్ విండో అధ్యక్షులు రామక్రిష్ణారెడ్డి, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విభజన హామీలను తుంగలో తొక్కిన బిజెపి

సిపిఎం-సిపిఐ రాజకీయ ప్రచార భేరిలో నాయకులు



మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

ప్రజాశక్తి-ములకలచెరువు

రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు, రాష్ట్ర విభజన హామీలను బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కిందని సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు నరసింహులు, శ్రీనివాసులు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, ఉభయ వామపక్ష పార్టీల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమంలో శుక్రవారం ములకలచెరువులో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వేజోన్‌తో పాటు వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రాకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్కటి అమలు చేయకుండా ఆంధ్రులకు నమ్మక ద్రోహం చేసిందని విమర్శించారు. వ్యవసాయాన్ని సైతం కార్పొరేటర్లకు ధారాదత్తం చేస్తోందని తెలిపారు. దేశంలోనే అడవులను, భూములను, విద్యుత్ ప్రాజెక్టులను, గనులను సైతం కార్పొరేటర్లకు అక్రమంగా కట్టబెడుతుందన్నారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ గంగవరం, కృష్ణపట్నం వంటి కీలకమైన ఓడరేవులను హైడ్రో విద్యుత్ ప్రాజెక్టులను సోలార్ విద్యుత్ కోసం ఎంతో విలువైన భూములను సైతం ఆదానికి సమర్పించుకుంటూ ఉందని, మోడీ ఆదేశాలకు లొంగి ప్రజల మీద విద్యుత్ స్మార్ట్ మీటర్లను అధిక భారాలను జగన్ సర్కార్ రుద్దుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబశివ, తంబళ్లపల్లి నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యుడు కృష్ణప్ప, నాయకులు మహేష్, హరిశర్మ, అంజనప్ప, ఆనంద్, వెంకటస్వామి, జయకర్, ఆదినారాయణ, సుధాకర్ పాల్గొన్నారు.

ఒంటిమిట్ట, పెద్దదర్గాను దర్శించిన గవర్నర్



ఒంటిమిట్టలో గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట/కడప అర్బన్

మత సామరస్యానికి ప్రతీకైన కడప అమీన్‌పీర్ పెద్దదర్గాను సందర్శించడం తన అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన గవర్నర్ తొలుత ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయం అర్చకులు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మేళతాలలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీ కోదండరామ స్వామి దర్శనం అనంతరం రంగ మండపంలో అర్చకులు గవర్నర్‌కు వేద ఆశీర్వాదం చేశారు. టిటిడి జెఇఒ వీరబ్రహ్మం స్వామి వారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందించి శేష వస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, కలెక్టర్ వి.విజయ్‌రామరాజు, ఎస్‌పి అన్బురాజన్, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, కడప, బద్వేల్ ఆర్‌డిఒలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, జిల్లా అధికారులు, తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం కడప పెద్దదర్గాను సందర్శించారు. ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్ బాబు, కలెక్టర్ వి.విజయ్ రామరాజులతో కలిసి పెద్దదర్గాలో పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకు ముందుగా దర్గా ప్రతినిధులు గవర్నరుకు, అతిథులకు లాంఛనాలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం దర్గా విశిష్టత, చరిత్ర గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కడప నగర కమిషనర్ జి.ఎస్.ఎస్.ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, తహశీల్దార్లు శివరామిరెడ్డి, ఉదయ్ కుమార్ రాజు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి కృష్ణకిషోర్, డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. గవర్నర్ జిల్లాలో ఒక రోజు పర్యటన ముగించుకొని కడప విమానాశ్రయం నుండి సాయంత్రం 6.03 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ప్రతిష్ట పెంచేలా ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ గిరీష అన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన అర్జీలు, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, జగనన్న భూ హక్కు-భూ రక్ష పథకం, నాడు-నేడు, విద్యా కానుక, సచివాలయ సేవలు తదితర అంశాల్లో సాధించిన ప్రగతి, తదితరాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో ముఖ్యమంత్రి సమీక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లోని విసి హాలులో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాల లక్ష్యాల సాధనకు అధికారులు నిబద్ధతతో ఖాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. మే నెల 9న ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతగా ప్రారంభించనున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని అదేశించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కార్యాలయ స్థాయి నుండి నేరుగా సచివాలయాల పరిధిలో పర్యవేక్షణ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నడిచేందుకు ప్రత్యేకంగా నియమించిన సీనియర్ లెవెల్ ఐఎఎస్ అధికారులు నెలకు రెండు పర్యాయాలు జిల్లాల్లో పర్యటించి ఈ కార్యక్రమం అమలు తీరును పరిశీలిస్తారన్నారు. ఈ వినూత్న ప్రాజెక్టు విధానం ద్వారా నాణ్యమైన, సంతృప్తికరమైన, పారదర్శకమైన పరిష్కారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 1902 కాల్స్ స్వీకరణ, ఐవిఆర్ఎస్ ఎస్ఎంఎస్ సందేశం, ఫీడ్ బ్యాక్, అప్ డేట్ సమాచారం ఎప్పటికప్పుడు హెల్ప్ డెస్క్ కంట్రోల్ రూమ్ నుండి అందుతుందన్నారు. 19,152 గృహాలు పూర్తి కావడం జరిగిందని, జగనన్న లెఔట్ కాలనీలలో తుది దశలో ఉన్న ఇళ్ళను వెంటనే పూర్తి చేయాలనీ గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. జూన్ నెల 12న పాటశాలలు తెరిచే లోగా జిల్లాకు వచ్చిన జగనన్న విద్యా కిట్లను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పక్కగా పంపిణీ చేయాలన్నారు. మే ఒకటవ తేదీలోగా పాటశాలలకు నైట్ వాచ్మెన్ నియామకాల ప్రక్రియ పూర్తి చేయాల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌పి గంగాధర్‌రావు, డిఆర్ఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు రైల్వేకోడూరు ప్రసిద్ధి

వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి



మంత్రికి స్వాగతం పలుకుతున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో ఉద్యాన పంటలకు రైల్వేకోడూరు ప్రసిద్ధిగాంచిందని జిల్లా ఇన్‌ఛార్జి, వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం అనంతరాజుపేట హార్టికల్చర్ విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన హార్టికల్చర్ పరిపాలన భవనం, పీజీ విద్యార్థుల హాస్టల్ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన కళాశాల శాస్త్రవేత్తలను తయారు చేస్తున్నదన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి స్థాపించిన ఈ కళాశాల ఎంతో అభివృద్ధికి మారుపేరుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో దాదాపు వందలాది మంది విద్యార్థులు శాస్త్రవేత్తలుగా తయారవుతున్నారని తెలిపారు. పాడి పంటలకు ప్రసిద్ధిగాంచిన రైల్వేకోడూరు ప్రాంతంలో పంటలకు వచ్చే తెగుళ్లను అరికట్టడంలో ఈ శాస్త్రవేత్తలు అద్భుతంగా పనిచేస్తున్నారని కొనియాడారు. రూ.14 కోట్లతో అద్భుతంగా భవనాలను నిర్మించారన్నారు. వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదన్నారు. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో ఈ చక్కటి వాతావరణంలో ఈ భవనాలను నిర్మించి విద్యార్థులకు కళాశాలకు మంచి పేరు వచ్చిందని పేర్కొన్నారు. చక్కటి విద్యకు పునాదిగా అనంతరాజుపేట హార్టికల్చరల్ కళాశాలగా పేరుగాంచిందని అన్నారు. అనంతరం రైల్వే కోడూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను మంత్రి ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటైన మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్దులూరు సుబ్బరామరాజు కమిటీ సభ్యులతో మంత్రి గోవర్ధన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి ధ్వజారెడ్డి, అధికారులు, మిత్రులకు ఉపసర్పంచి తోట శివ సాయి గంగమ్మ జాతర సందర్భంగా విందు ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, విసి జానకిరామ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, అసోసియేట్ డీన్‌తోపాటు ఉద్యానవన కళాశాల సిబ్బంది వైసిపి స్టేట్ మెంబర్ హెమనవర్మ, టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఎంపిటిసి జనార్ధన్‌రాజు పాల్గొన్నారు.



వాల్మీకిపురం : సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు :'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించాలన్నదే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరమడక, మూగలమర్రి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ భాస్కర్, నాయకులు యోగి, మాధవరెడ్డి, నీళ్లభాస్కర్, సురేష్ రెడ్డి, శివారెడ్డి, రాయుడు, ఆనంద పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** ప్రతి గడపను సందర్శించి ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సంబేపల్లె మండలం శెట్టిపల్లెలో గడప గడపకూ మన ప్రభుత్వంను నిర్వాహించి ప్రతి పల్లెకు, ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడం సంతోషంగా ఉందన్నారు. వెనుకబడిన బిడికిలలోనూ, దళిత వాడలలోనూ సిమెంట్ రోడ్లు నిర్మాణాలు చాలా వరకు చేపట్టామని తెలిపారు. రెడ్డిమల్లువాండ్లపల్లెలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలతో శ్రీకాంత్‌రెడ్డి మమేకమై రాగి జావతాగారు.

కర్ణాటకలో కాంగ్రెస్‌దే గెలుపు : డిసిసి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయమని, బిజెపి అధికారాన్ని నిలబెట్టు కోవాలని సర్వ ప్రయత్నాలు చేస్తూ నరేంద్ర మోడీ పగటి కలలు కంటున్నారని డిసిసి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ప్రజలకు మోసం చేశారు. ఖాతాదారునికి బ్యాంక్ అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తామని మాయమాటలు చెప్పి మడమ తిప్పారన్నారు. ప్రజలు ఏదీ మర్చిపో లేదని వచ్చే నెల జరిగే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ పార్టీకి 135 అసెంబ్లీ స్థానాలు గెలిపించి ప్రజలు బిజెపికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్‌ఆర్‌సి, సిఎఎ, త్రిబుల్ తలాక్, హిజాబ్‌పై జరిగిన పోరాట దృశ్యాలను ముస్లిం మైనార్టీలు ఇంకా మరిచి పోలేదని ఈ దృశ్యాలే బిజెపి పాలిట అస్త్రాలుగా మారుతాయని పేర్కొన్నారు. అన్ని అబద్దాలు చెప్పి కేంద్రంలో అధికారాన్ని దక్కించుకున్న మోడీకి కర్ణాటక ప్రజలే ఓటుతో సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్, నిత్యవసర సరుకుల ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచినందుకు బిజెపికి బుద్ధి చెప్పి, కేంద్రంలో మోడీకి గద్దె దించడానికి కర్ణాటక ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుండె వైద్యంలో ప్రఖ్యాతి గాంచిన నారాయణ హృదయాలయ వారితో కలిసి, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) నిర్వహిస్తున్న 14వ హార్ట్ క్యాంపు శనివారం సిటిఎం క్రాస్ రోడ్ వద్దనున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసినట్టు, ఆసంస్థ నాయకులు రాయల్ సూర్య, ఆటో శ్రీరాములు, బురుజు రెడ్డిప్రసాద్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ బండపల్లి ఈశ్వరమ్మ, అక్కులప్ప దంపతులు ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ ఈ వైద్య శిబిరం జరుగుతుంన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.ఐదు వేలు ఖర్చయ్యే ఇసిజి, ఎకో, బిపి, షుగర్ పరీక్షలను డాక్టర్లు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాస్ నాయకులు కోరారు.

'నాడు-నేడు పనుల్లో పురోగతి కనిపించాలి'

ప్రజాశక్తి-రాయచోటి

పాఠశాలల్లో నాడు-నేడు కింద చేపట్టిన పనుల్లో పురోగతి కనిపించాలని కలెక్టర్ గిరీష అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మనబడి-నాడు నేడు రెండో విడత పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న వివిధ వస్తువులు మరింత నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు జగనన్న విద్యా కానుక రిపోర్ట్ పంపాలని డిఇఒను ఆదేశించారు. ఎక్కడ చిన్నపాటి లోపాలు సైతం లేకుండా పకడ్బందీగా పథకం అమలు కావాలన్నారు. ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టడంతోపాటు డిజిటల్ విద్యలో విద్యార్థులను ముందుండేలా చేసేందుకు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశామని, అవి సరిగా పనిచేస్తున్నాయా, పనిచేయకపోతే డిజిటల్ అసిస్టెంట్‌ల ద్వారా బాగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని హెడ్మాస్టర్లను కలెక్టర్ ఆదేశించారు. మనబడి-నాడు నేడు రెండో విడత పాఠశాలలకు సంబంధించి మరుగుదొడ్లు, కిచెన్ షెడ్స్, మేజర్, మైనర్ రిపేర్స్, ఎలక్ట్రీషియన్ పనులు, తదితర పది రకాల కాంపోనెంట్స్ పనులను వెంటనే ప్రారంభించి వచ్చేవారం కల్లా పురోగతి కనిపించాలన్నారు. టాయిలెట్స్ నిర్మాణంలో గత వారం నుంచి ఈ వారానికి ప్రోగ్రెస్ లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి, ప్రాధాన్యత క్రమంలో టాయిలెట్స్ నిర్మాణం వంద శాతం ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. ప్రతిరోజు ఎక్స్పెండిచర్ ఖర్చు చేయాలన్నారు. సమావేశంలో డిఇఒ పురుషోత్తం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ప్రసన్న కుమార్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, సమగ్ర శిక్ష సిఎంఒ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

కాలం కన్నా ప్రాణం విలువైంది : సిఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కాలం కన్నా ప్రాణం విలువైనదని, అతివేగం నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదంలో చాలామంది యువకులు అకాల మరణం చెందుతున్నారని టూటౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరిష, ఎస్పీ ఆర్.గంగాధర్ రావు ఆదేశాల మేరకు మదనపల్లి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ కేశప్ప పర్యవేక్షణలో శుక్రవారం పట్టణం మరియు పరిసర ప్రాంతాలలో మదనపల్లి ఆర్టీవో దినేష్ చంద్ర, ఆర్అండ్‌బి డిఇ ఎస్.శ్రీనివాస్, ఎఇ బుర్రయ్య, ఇంజినీరింగ్ విభాగం రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు సందర్శించడం జరిగిందని తెలిపారు. మదనపల్లి పట్టణంలో చంద్ర కాలనీ, అన్నమయ్య సర్కిల్, ప్రశాంత్ నగర్, నిమ్మనపల్లి క్రాస్, ఉషోదయ స్కూల్, బైపాస్ రోడ్డులోని కొన్ని ప్రదేశాలను జాయింట్ విజిట్ ద్వారా సందర్శించడం జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను నివారణ మార్గాలను స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, ఇంజినీరింగ్ విభాగం ద్వారా ఇంకా కొన్ని రోడ్డు ప్రమాదనివారణకు సంబంధించి ఒక నివేదిక తయారు చేయడం జరిగిందని తెలియజేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదకరమైన మలుపుల వద్దఓవర్టేక్ చేయరాదని, వాహనదారులు తమ వాహనాలను మంచి కండిషన్లో ఉంచుకోవాలని, వాహనాలను నడిపేటప్పుడు తమ కుటుంబ సభ్యులను గుర్తుంచుకోవాలని సూచించారు.



రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు సందర్శిస్తున్న అధికారులు

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ గిరీష అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 12వ జిల్లా పరిశ్రమల ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. జిల్లాలో నూతన పరిశ్రమలు స్థాపించేందుకు అధికారులు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నూతన పరిశ్రమలు స్థాపించేందుకు అనుమతులకు సంబంధించి ఇప్పటి వరకు 1482 దరఖాస్తులు వచ్చాయన్నారు. 1428 ధరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. గడువులోపల పరిష్కరించాల్సిన అర్జీలు 7 ఉన్నాయని వీటిని వెంటనే క్లియర్ చేయాలన్నారు. ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ-2020-23, రెండు పరిశ్రమలకు 23,15,345, వైయస్సార్ జగనన్న బడుగు వికాసం కింద 9 యూనిట్లకు (వాహనాలు) పెట్టుబడి రాయితీకి సంబంధించి రూ.72,58,330 మంజూరు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ రాయితీ కింద ఒక పరిశ్రమకు రూ.1,95,865 మంజూరు చేయడమైనదన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం 2023-24 కింద జిల్లాలో ఇప్పటి వరకు 34 యూనిట్‌లకు గాను రూ.71.64 లక్షలు బ్యాంకులు రుణ మంజూరు చేశాయన్నారు. ఇంకా బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వివిధ బ్యాంకుల ద్వారా రుణ మంజూరు చేయించవలసిందిగా లీడ్ బ్యాంకు మేనేజర్‌ను కలెక్టర్ ఆదేశించారు. సులభతర వాణిజ్య విధానం కింద సింగల్ డెస్క్ పోర్టల్ నందు జనవరి 1,2022 నుండి అక్టోబర్31, 2022 వరకు వివిధ శాఖల నుండి పొందిన సేవల మీద దరఖాస్తుదారులను సర్వే చేయడం జరుగుచున్నందున వివిధ శాఖల అధికారులు ఫీడ్బ్యాక్ సర్వే చేయవలసిందిగా ఆదేశించారు. ఈ ఏడాది కూడా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నందు మన రాష్ట్రము మొదటి ర్యాంకును పొందేందుకు అన్నమయ్య జిల్లా పూర్తి తోడ్పాటు అందించాలని వివిధ శాఖల నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎపిఐఐసి ఆటో నగర్ పీలేరులో ఫ్లాట్ అలాట్మెంట్ పొందిన 15 యూనిట్లకు ల్యాండ్ రిబేట్ కొరకు అర్హత పత్రాలు ఇవ్వడం కొరకు ఆమోదం తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జె.నాగరాజ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు నెలకు ఒకటి చొప్పున 12 ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాలు నిర్వహించామన్నారు. ప్రతినెలా ఈ సమావేశం క్రమం తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా రవాణ శాఖ అధికారి శాంతకుమారి, ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అధికారి నారాయణరెడ్డి, ఎపిఎస్ఎఫ్‌సి అధికారి నాగభూషణం, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి శివప్రసాద్, జిల్లా కార్మిక శాఖ అధికారి డి.రంగరాజు, డిఐఎ కన్వీనర్ రాజశేఖర్, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయలసీమ కో-కన్వీనర్ రామదాస్ చౌదరి

అభివృద్ధిలో వెనుకబడిన మదనపల్లె : జనసేన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందని జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లిలో జనంతో టి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో మమేకం కావడానికి జనసేన పార్టీ నాయకులు గ్రామస్తులతో కలిసి టి తాగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం యువత జనసేన పార్టీ వైపు చూస్తోందని పేర్కొన్నారు. మదనపల్లె నియోజకవర్గం అభివృద్ధిలో ఎంతో వెనుకబడి ఉందని, వైసిపి ప్రజా ప్రతినిధులు ఎవరు మదనపల్లె అభివృద్ధిని పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ముఖ్యంగా మదనపల్లె జిల్లా కావడానికి అన్ని అర్హతలు ఉన్నా ఇక్కడ పాలకులు జిల్లా కాకుండా చేశారన్నారు. అదేవిధంగా హంద్రీనీవా కాలవ ద్వారా కృష్ణా జలాలు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. కనీసం ఇక్కడ వర్షాలతో నిండే అవకాశం ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు మొరవ నిర్మాణం చేపట్టకపోవడంతో ఎడారిగా మారాయని విమర్శించారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడు పనులు ఏవి చేయలేదన్నారు. సమావేశాల్లో మాత్రం అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపట్టినట్లు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాబోయే కాలంలో ప్రజాపోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివ రామ్ రాయల్, నాయకులు అడపా సురేంద్ర, జగదీష్, గ్రానైట్ బాబు, సనా ఉల్లా, జనార్ధన్, రెడ్డెమ్మ, అర్జున,కుమార్, లక్ష్మీపతి, శంకర పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం తగదు

- ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వెస్లీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆరోగ్యవరం మెడికల్ డైరెక్టర్ మార్పు జరగలేదని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ఇచ్చిన ప్రకటనను ఖండిస్తున్నామని ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వెస్లీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకులతో మాట్లాడుతూ రాయలసీను డయాసిస్ బిషప్ రెవరెండ్ ఐజాక్ వరప్రసాద్ ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌కు కొత్త డైరెక్టర్‌ను నియమించారని ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇది చట్టవిరుద్ధమని, ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ నియమ, నిబంధనలకు విరుద్ధమన్నారు. ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ ఒక రిజిస్టర్డ్ సొసైటీ, 110 సంవత్సరాలుగా పాలక మండలి యొక్క అసోసియేషన్ యొక్క బైలాస్ తో కలిసి పనిచేస్తోందని పేర్కొన్నారు. రాయలసీమ డయోసిస్ బిషప్ అసోసియేషన్, గవర్నింగ్ బాడికి అధ్యక్షుడు కాదని, ఆయన చట్టవిరుద్ధంగా డయోరెషన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారన్నారు. చిత్తూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టులో పిటీషన్ దాఖలు చేయగా, తుది వ్యాజ్యం పరిష్కారమయ్యే వరకు ప్రతివాది అంటే రాయలసీమ డయోసిస్ బిషప్ ప్రొసీడింగ్స్ కొనసాగించలేమని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ తర్వాత వచ్చిన కోర్టు ఉత్తర్వుల తర్వాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై కూడా కోర్టు ఉత్తర్వులు ఉన్నందున ఎస్బిఐ మేనేజర్ గౌరవించని తప్పుడు తీర్మానాలతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కలవరపాటుకు గురిచేసిందన్నారు. ఇప్పుడు కొత్త డైరెక్టర్‌గా డాక్టర్ రవీంద్రను నియమించారని బిషప్ ప్రజలకు తప్పుడు నోటిఫికేషన్ ఇచ్చారని, ఇది చట్టవిరుద్ధమన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణం వల్ల కలిగిన అప్పులు తీర్చే వరకు డాక్టర్ వెల్లీ ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ డైరెక్టర్‌గా కొనసాగుతారని పాలకమండలి 16-05-2022న తీర్మానం చేసిందని, అందుకే అప్పులు తీర్చే వరకు డైరెక్టర్ గా కొనసాగుతున్నానన్నారు. ఎంసికి చెందిన కొంత భూమిని జాతీయ రహదారులు స్వాధీనం చేసుకోబోతున్నందున జాతీయ రహదారుల నుంచి పరిహారం మొత్తం అందిన వెంటనే బకాయిలు క్లియర్ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త డైరెక్టర్ నియామకానికి హడావుడిగా, అసత్యంగా, చట్టవిరుద్ధంగా ప్రొసిడింగ్స్ చేస్తూ వరప్రసాద్ సంస్థకు సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. ఆరోగ్యవరం డైరెక్టర్‌గా వెస్లీనే ఉంటారని డాక్టర్ రిచర్డ్ పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఎలాంటి సమావేశాలు జరపకూడదని తెలిపారు. సిబ్బందికి జీతాలు రాకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. డాక్టర్ వెస్లీకి అందరూఐ మద్దతుగా నిలవాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలు రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఎమెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గోపిదిన్నె పంచాయితీలో ఉప్పులూరువాండ్లపల్లె, బల్లాపురంపల్లె, గోపిదిన్నెకప్ప హరిజనవాడలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి ప్రజలను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలకు సంబంధించిన అధికారులతో చర్చించి అక్కడికక్కడే పరిష్కరించారు. వైసిపి పాలనపై ప్రజల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పాలన చేస్తూ విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత కల్పించిన ఘనత సిఎం జగన్‌దేనని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పోరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మల్లయ్య కొండ చైర్మన్ మల్రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, నారాయణరెడ్డి, మల్లయ్య కొండ ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, గొర్ల మల్లిరెడ్డి, నరేంద్రరెడ్డి, కరీం, రామ్మూర్తి, కోటిరెడ్డి, ఎంపిడిఒ ఆనంద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

తుమ్మనగుంట మసీదు పరిశీలన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని తుమ్మనగుంట మసీదును శుక్రవారం జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఎస్‌ఎ.కరీముల్లా పరిశీలించారు.రహదారి విస్తరణలో భాగంగా మసీదును తొలగించడంతో స్థానిక మసీదు పెద్దలు, ముస్లిం మైనార్టీలు నూతన మసీదు నిర్మాణం కోసం చర్యలు తీకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ ఇప్పటికే కొంత మేర నష్ట పరిహారం అందిందని, మరి కొంత ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిల సహకారంతో వక్ఫ్‌బోర్డు ద్వారా నూతన మసీదు నిర్మాణానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మసీదు కమిటీ సభ్యులు, ముతవల్లిలు జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను దుశ్శాలువ, గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో తుమ్మనగుట్ట వైస్ ఎంపిపి ఖాదర్‌వల్లి, ఫయాజ్, సాదిక్, మసీదు కమిటీ సభ్యులు, ముతవలిలు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక ఎస్‌ఐ రామ్మోహన్ కుమార్తె శ్రీనిక జన్మదినం సందర్భంగా ఆయన భార్య శ్యామలతో వెలుగు పాఠశాలలో వృద్ధులకు, పిల్లలకు భోజన వసతిని ఏర్పాటు చేశారు. వెలుగు కార్యకలాపాల గురించి వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి వివరించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలో శ్రీనిక జన్మదిన సందర్భంగా పిల్లలందరి సమక్షంలో కేక్ కట్ చేయగా పిల్లలందరూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మా పిల్లల జన్మదినాలు ఇంట్లో ఆర్భాటంగా చేయడం కన్నా ఇలాంటి స్వచ్ఛంధ సంస్థల్లో, వృద్ధాశ్రమాల్లో చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలి పారు. కార్యక్రమంలో బి.కొత్తకోట పోలీస్ సిబ్బంది, వెలుగు ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, కన్వీ నర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసేందుకు సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ త్యాగరాజు తెలిపారు. శుక్రవారం ఎంఆర్‌సి కార్యాలయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. రిసోర్స్ పర్సన్ చంద్రశేఖర్ రెడ్డి, పేరెంట్స్, కమిటీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థు లందరికీ భాగస్వామ్యంతో సామాజికత్వానికి చేయాలన్నారు. పాఠశాల భౌతిక వనరులు పలు రకాల పరీక్షలు సవరణాత్మక బోధన, సహ పాఠ్య కార్యక లాపాలు, సూత్రాలు, ఉపాధ్యాయులకు వృత్తంతా శిక్షణ, ప్రత్యేక అవస రాల పిల్లలకు అందించు సౌకర్యాలు, బాలికల రక్షణ, బాలికల హక్కుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయడం తదితర అంశాలపై వివరించారు.

పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపాలి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రతి ఒక్క విద్యారిః చిన్నతనం నుంచే పోటీ పరీక్షల్లో పాల్గొనే సత్తా సాధించు కోవాలని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఒ.నిర్మల పేర్కొన్నారు. శుక్ర వారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవ రణంలో ఐదో తరగతి చదువుతున్న 18 మంది విద్యార్థులు నవోదయ పరీక్షకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. సోమవారం రాయచోటి లో ఉదయం 11:30 నుంచి 1:30 వరకు పరీక్ష జరుగుతుందని పరీక్షలో మంచి మార్కు లతో విజయం సాధించి ప్రతి ఒక్కరు జవహర్ నవోదయ పరిక్షలో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్కూల్ కమీటి చైర్మన్ కుందాలక్ష్మీ ప్రసన్న, పిఇటి కరుణాకర్, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఎర్రచెరువుపల్లె హరిజనవాడలో శుక్రవారం సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి యువ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు, అందరూ సుఖ సంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో రైతులు పచ్చని పంటలతో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని పూజలు నిర్వహించానని అన్నారు. కార్యక్రమంలో చింతలకుంట యానాదిరెడ్డి, వేణుగోపాల్, తిప్పన పెంచలయ్య, రామచంద్ర, ఇరువూరి సుధాకర్,రమేష్, నాగయ్య పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞం ఏర్పాటు అభినందనీయం

రామాపురం : మహాభారతం పై ప్రజలకు అవగాహన పెంచి భక్తిని పెంచేందుకు మహాభారత యజ్ఞం ఏర్పాటు చేయడం హర్షణీయమని కడప మేయర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జరుగుతున్న మహాభారత యజ్ఞంలో అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహాభారత యజ్ఞంలో శుద్ధమల్ల మాజీ ఉపసర్పంచ్ వీరబల్లి నాగిరెడ్డి, ఆయన కుమారుడు నాగేంద్ర కుమార్‌రెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ రెడ్డి, జెడ్పిటిసి వెంకటరమణ, స్థానిక సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 'విశ్వం' విద్యార్థులు ఎంపిక

కురబలకోట : ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలకు విశ్వం ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.డి.వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం జరిగిన ఉద్యోగ ఎంపికలకు టెక్ మహేంద్ర, మల్టీనేషనల్ కంపెనీ చెన్నై విభాగం ఆధ్వర్యంలో ఈ నియా మకాలను జరిపారు. ఈ ఎంపికల్లో ఇసిఇ, మెకానికల్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికలో గ్రూప్ డిస్కసన్, టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ నిర్వహించారు. ఈ ఎంపికలో యాభై మంది ఎంపికయినట్లు వారు తెలిపారు.ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి అభినందించారు. తెలియ చేసారు

ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం

పుల్లంపేట: ప్రజల గుండెల్లో సిఎం జగన్ సుస్థిర స్థానాన్ని సంపాదించారని ప్రభుత్వ విప్ రైల్వే కోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నాడు మండల పరిధిలోని జాగువారిపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వంలో కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, మండల కన్వీనర్ ముస్తాక్, దలవాయిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, నరసింహారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

సరిహద్దు రాళ్లు ఏర్పాటు

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం కింద ఇదివరకే రీసర్వే పూర్తి అయ్యి, రీ సర్వే పూర్తయిన గ్రామాలలో సర్వే నెంబర్ల భూమి హద్దుల నందు రాళ్లు నాటే కార్యక్రమం చేపట్టారు. తహశీల్దార్, రెవెన్యూ సిబ్బందితో రాళ్లు నాటే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రీ సర్వే కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకమైనదన్నారు. ప్రజలందరి సహకారంతో వారి వారి భూకమతాలు కొలిచి సరిహద్దును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.రీసర్వేలో డ్రోన్ సర్వే ద్వారా , రోవర్ యంత్రాలతో కొలిచిన భూ సర్వే రాళ్లను నాటడం జరుగుతుందని తెలిపారు.

ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు



ఎస్.తులసి నందీష ఒ.ఐశ్వర్య రేణుక

ప్రయివేట్ కళాశాలలకు ధీటుగా..

ప్రజాశక్తి -కలకడ



లక్ష్మిదేవి

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల, ఆదర్శ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి మేటిగా నిలిచారు. కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం నందు 32 మంది పరీక్షలు హాజరుకాగా 31 మంది ఉత్తీర్ణులై 97 శాతం సాధించినట్లు ప్రిన్సిపల్ అనిత తెలిపారు. కె.మాధలత 466, నాగవేణి465 మార్కులు సాధించినట్లు తెలిపారు. రెండవ సంవత్సరంలో 28 మంది పరీక్షలు హాజరు కాగా 26 మంది పాసై 93 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 1000 మార్కులు గాను రేణుక 968 మార్కులు, ఐశ్వర్య 948, లక్ష్మీదేవి 948, తులసి 947 మార్కులు, నందీషా 940 మార్కుల సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నందు 68 మంది విద్యార్థులకు గాను 35 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 51.47 సాధించినట్లు ప్రిన్సిపల్ మలన్‌షావలి తెలిపారు. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో 78 మంది విద్యార్థులుగాను 65 మంది విద్యార్థులు 83.3 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

ప్రతిభ చాటిన ఆర్‌ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-గాలివీడు

ఇంటర్ ఫలితాల్లో స్థానిక ఆర్‌ఆర్ జూనియర్ కళాశాల మండలంలో మొదటి స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ జయచంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీని యర్ ఇంటర్‌లో గాయత్రి బైపి సిలో 938 మార్కులు సా ధించి ప్రథమ స్థానం దక్కించుకుంది. షేక్.అర్షియా సిఇసి గ్రూపులో 923 మార్కులు సాధించింది. ఎస్.రూపియ బైపిసిలో 919 మార్కులతో విజయం సాధించింది షేక్.ముష్ ఫిరా సిఇసి గ్రూపుకు 437 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. వై.నందిని 379 మార్కులతో సిఇసి గ్రూపులో రెండవ స్థానం, ఎస్.శ్వేత ఎంపిసి గ్రూపులో 360 మార్కులు, ఇలా ప్రతి ఏడాది తమ కళాశాలలో ఇంటర్, డిగ్రీ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు.



గాయత్రి నందిని రుపియా షేక్ అర్షియా



శ్వేత ముషిపా

రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన శ్రీనివాస విద్యార్థులు

కలికిరి : శ్రీనివాస జూనియర్, డిగ్రీ కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల కరస్పాం డెంట్ పివి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఎంపిసి విభాగంలో ఎం.హేమంత్ కుమార్ 987 మార్కులతో రాష్ట్ర మూడో ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. డి.ప్రదీప్ 974 మార్కులు, ఎస్.లాలస 973 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. బైపిసి విభాగంలో ఎస్.మసేర ఫిర్దోస్ 942, ఏ.హర్షియా 935 ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. సిఇసి విభాగంలో లక్ష్మీమంజుల 956, జె.హరితతస్నిన్ 954 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపిసి విభాగంలో ఎస్ తేజబ్ సుహాన 433 మార్కులతో రాష్ట్ర మూడో ర్యాంకు సాధించారు. ఎస్.నీరజ 422 సాధించారు. ఎంపిసి విభాగంలో సి.దీపకసింధు 458, ఎస్.ఆసిన్ 456 మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. సిఇసి విభాగంలో టి.మహాలక్ష్మి 438 ,వి.నిరంజన్ 437 ద్వితీయ స్థానాలు సాధించారు. రాష్ట్రంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, కళాశాల సిబ్బంది అభినందిచారు.



హేమంత్ కుమార్ రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్

కృష్ణారెడ్డి సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్:

స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని శ్రీకృష్ణారెడ్డి సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపిసిలో ఎ.హర్షిణిప్రియ 989 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఎస్.హర్షిత 985 మార్కులు, ఎస్.హిమబిందు 985 మార్కులు, ఎస్.కీర్తిన 984 మార్కులు, జి.ప్రణిత 979 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపిసి నందు యం.మడోన్నా 974 మార్కులు, సోనియా, చందులు 965 మార్కులు సాధించినట్లు తెలిపారు. సిఇసి నందు జానికి 942 మార్కులు, జానికి 940 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరవ ఫలితాలలో ఎంపిసి నందు యం.కిషోర్ 459 మార్కులు, వంశీకృష్ణ 458 మార్కులు, వై.సిరి 456 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైసిసిలో ఎస్.మహేంద్ర 433 మార్కులు, ఎస్.బుషిత 431 మార్కులు సాధించినట్లు తెలిపారు. సిఇసిలో గాయత్రి 476 మార్కులు, గుణశ్రీ 451 మార్కులు సాధించినట్లు తెలిపారు.

విశ్వహిత మాస్టర్ మైండ్స్ విద్యార్థుల విజయభేరి

మదనపల్లె అర్బన్:

రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఇంటర్‌మీడియట్ ఫలితాలలో స్థానిక విశ్వహిత మాస్టం మైండ్స్ జూనియర్ కళాశాల విద్యార్థుల విజయభేరి మోగించి నట్లు కళాశాల కరస్పాండెట్స్ ఉదయ్ బాస్కర్, వివేకానంద ప్రసాద్‌లు తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపిసి నందు కె.సాయి ఆనందిని 986 మార్కులు సాధించి కళాశాల లో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఎంఇసి నందు వి.ఆర్.త్రిష 972 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంత్సరం ఫలితాలలో ఎంఇసిలో ఎస్.అర్షయ 488 మార్కులు సాధించి పట్టణంలో మొదటి సాథనంలో నిలిచిందన్నారు. ఇంతటి ఘనవిజయానికి కారకులైన విద్యార్థులను, తలిదండ్రులను, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇదే ఫలితాలను కొనసాగిస్తామని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఉత్తీర్ణులైన విద్యార్థులుఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు



మదనపల్లె : విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ కళాశాల ప్రిన్సిపల్

నారాయణ విద్యార్థుల విజయకేతనం

మదనపల్లె అర్బన్ : స్థానిక నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ తారకరామానాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపిసి నందు బి.మౌనిక 980 మార్కులు, యం.క్రుతిక 976 మార్కులు, కె.భవాన 976 మార్కులు, ఎ.యషిత 974 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైసిని నందు జి.గిరివర్షిత 970 మార్కులు, వి.అమన అంజుమ్ 968 మార్కులు, యం.ధీరశ్రీ 950 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో ఎంపిసి నందు వి.సాయిమేఘన 462 మార్కులు, ఎ.కళ్యాణి 462 మార్కులు, కె.ధావన్ త్రివేధి 462 మార్కులు, ఎస్.హర్షిత, కె.విష్ణుప్రియలు 460 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపిసి నందు వి.అక్షయ 433 మార్కులు, షేక్ సానియా 423 మార్కులు,జి.ఎస్.ఇస్రా 422 మార్కులు సాధించినట్లు తెలిపారు. ద్యార్థులను, వారి తలిదండ్రులను, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీమదనపల్లె విద్యార్థుల విజయదుందుభి

మదనపల్లె అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఇంటర్ మీడియట్ ఫలితాలలో స్థానిక కదిరి రోడ్డులోని శ్రీమదనపల్లె జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుధింభి మ్రోగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపిసి నందు యం.కె.మమత 983 మార్కులు, ఎ.నీరజ 980 మార్కులు, కె.ఆశ 978 మార్కులు, వై.కవిత 972 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సర ఫలితాలలో ఎంపిసి నందు సి.భావన 461 మార్కులు, కె.వందన 459 మార్కులు. పి.నందిని 454 మార్కులు, బి.వెన్నెల 453 మార్కులు, జి.పుష్ప 452 మార్కులు, ఎస్.చిట్టి 426 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను, వారి తల్లి దండ్రులను, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపల్



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్

ప్రతిభను చాటుకున్న శ్రీచైతన్య విద్యార్థులు

మదనపల్లె అర్బన్: స్థానిక ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌బాబు తెలిపారు. ఇందులు సీనియర్ ఇంటర్ ఎంపిసిలో బి.మానస 980 మార్కులు, జి.వర్షిణి 978 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపిసి నందు సి.చోలా పాండియన్ 982 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచాడని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి నందు యం.చరణ్‌తేజ 458 మార్కులు, కె.నితీస్‌కుమార్‌రెడ్డి 458 మార్కులు, యు.సురజ్ 457 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపిసి నందు ఎ.దినేష్‌కార్తిక్ 430 మార్కులు, ఎంఇసి నందు ఎస్.తస్మయ అంజుమ్ 465 మార్కులు, ఎం.ఆర్.భవాని 464 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంతటి ఘనవిజయానికి కారకులైన విద్యార్థులను, వారి తలిదండ్రులను, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీలేరు శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

పీలేరు : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో పీలేరు శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ ఆర్. సుధానందరెడ్డి, ప్రిన్సిపల్ కె.నాగార్జున రెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసి గ్రూపులో ఎస్.షాహిల్ ఖాన్ 984, బి. సోనీప్రియ 971, బైపిసి గ్రూపులో పి.సాయిపవిత్ర 988, ఎస్ఎం మోహరుక్ 983, సిఇసి గ్రూపులో వి.చరణ్ తేజ 933, జి.నరసింహ 925 మార్కులు సాధించారన్నారు. అలాగే ప్రథమ సంవత్సరము ఎంపిసి గ్రూపులో కె. మానస 453, సి.హిమకిరణ్ రెడ్డి 437 తెచ్చుకున్నారని అన్నారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 900 మార్కులకుపైగా 25 మంది విద్యార్థులు, ప్రథమ సంవత్సరంలో 400 మార్కులకుపైగా 35 మంది విద్యార్థులు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు పి.జనార్ధనరెడ్డి, ఎస్.చంద్రశేఖర్, ఎం.లోకేశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.



సత్తా చాటిన శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు

ప్రతిభ చాటిన సాయి కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటిలో శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ ఫలితాలలో ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక శాతం మార్కులు సాధించారని విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటిలాగే ప్రథమ సంవత్సర ఫలితాలలో కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి యూనివర్సిటీ పరిధిలో కళాశాలను అగ్రస్థానంలో నిలబెట్టారని అన్నారు. ప్రథమ సంవత్సర ప్రథమ సెమిస్టర్ ఫలితాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో కె.సాఫీయా 89.44 శాతంతో మొదటి ర్యాంకు పఠాన్ ముస్కాన్, నీలి తేజస్విని 88.3 శాతంతో రెండవ ర్యాంకు షేక్ సానా షాజియా 87.89 శాతంతో మూడవర్యాంకు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం నుంచి షేక్ హుమేర 92.33 శాతంతో మొదటి ర్యాంకు, గురు సాయిచరణ్ 87.89 శాతంతో రెండవ ర్యాంకు, విజయలక్ష్మి 81.22 శాతంతో మూడవ ర్యాంకు సాధించారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యా ర్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.బాలాజీ ,సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్ .నాగేంద్ర, కంప్యూటర్ సైన్స్‌అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కార్తికేయన్ అధ్యాపకులు అభినందించారు.



ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులు

వ్యాధుల నియంత్రణకు కృషి

ప్రజాశక్తి-కలకడ

అసంక్రమణ వ్యాధుల నియంత్రణకు కృషి చేస్తామని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దిగువతాండ, ఎగువతాండ గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అసంక్రమమైన వ్యాధులైన బిపి, షుగర్ వ్యాధులకు మంచి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు గొడుగు, తలకుటోపి పెట్టుకోవాలని వడదెబ్బ నుండి రక్షణ పొందాలన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలకు టీకాలు కచ్చితంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య ఆరోగ్య కార్యకర్త బి.లక్ష్మి, రోజా పైలెట్ రమేష్‌బాబు, ఆశా కార్యకర్త రామల క్ష్మిబాయి పాల్గొన్నారు. **నందలూరు:** మండల పరిధిలోని మదనమోహనపురం, చింతకాయలపల్లి గ్రామాలలో విషజ్వరాలు ప్రభలడంతో డాక్టర్ సృజన ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఇంటింటికి లార్వా సర్వే, జ్వరసర్వే, బాధితుల పరామర్శ, రక్త పరీక్షలు, రక్త పూతలసేకరణ, క్రిమీ సంహారక మందుల పిచికారీ, బ్లీచింగ్, వైద్యపరీక్షలు, చికిత్స చేసి ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించి మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిహెచ్ఒ నారాయణ, సూపర్వైజర్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, మేల్‌హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు**: అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా సరైన నివారణ చర్యలు తీసుకోకపోతే వడదెబ్బ ప్రాణాంతకమని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు.ఒంటిల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సమీపాన నిర్వహిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఏఎన్ఎం వసుంధర, వెంకటరత్నం, సి.హెచ్.ఓ నాగముత్యం, ఫీల్డ్ అఫిసర్ సద్దాం హుస్సేన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పం వేగవంతం చేయండి

ప్రజాశక్తి-ములకలచెరువు

జగనన్న స్వచ్ఛత సంకల్పం కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేయాలని డిపిఒ ధనలక్ష్మి, పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కదిరినాధునికోట, వేపూరికోట సచివాలయం, చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. సచివాలయం సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు, సిబ్బంది పనితీరుపై చర్చించారు. అనంతరం వేపూరికోట పంచాయతీ రెడ్డివారిపల్లె అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, చిన్నారులతో మాట్లాడారు. అశ్వని, సర్పంచులు. సునీత, శంకర్రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు డిపిఒ వెంట ఉన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-రామాపురం

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కీలకమని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి.రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గువ్వల చెరువులోని శ్రీ బాలాజీ హైస్కూల్ 13వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుమూల ప్రాంతంలో స్కూల్ ఏర్పాటు చేసి విద్యను అందించడం సంతోషకరమన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాల న్నారు. అనంతరం ఎమ్మెల్సీని దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ రామకృష్ణుడు. విఆర్ స్కూల్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, వశిష్ట స్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి, బాలాజీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రెహనోమాబి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఉచిత లోక్ అదాలత్ వినియోగించుకోండి'

నందలూరు : జాతీయ లోక్ అదాలత్‌లకు సంబంధించి ప్రతిరోజు నిర్వహించే ఫ్రీ సిట్టింగ్స్ నిర్వహించడం జరుగుతుందని, వాటిని, కక్షిదారులు వినియోగించు కోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు నందు ఆమె పోలీస్ అధికారులతో నేర సమావేశం నిర్వహించారు. ఇందులో మే 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడునని, అందులో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కారం కొరకు కృషి చేయాలని ఆమె సూచించారు. సమావేశంలో మన్నూరు సిఐకె.పుల్లయ్య, రాజంపేట్ సిఐ నరసింహరావు, మన్నూరు ఎస్ఐ భక్తవత్సలం, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా పసుపులేటి శంకర్

నందలూరు : నందలూరుకు చెందిన పసుపులేటి శంకర్‌ను రాజంపేట ప్రత్యేక న్యాయవిచారణ రెండవ తరగతి మేజిస్ట్రేట్‌గా నియమిస్తూ ప్రభుత్వం రాజపత్రం విడిదలచేసింది. శంకర్ ఒంటిమిట్టలో ఉన్నత పాఠశాల నెలకొల్పి ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. నందలూరు అల్విన్ కర్మాగారంలో యూనియన్ కార్యదర్శిగా ఉన్నారు. పాత్రికేయునిగా మంచి కథనాలు రాసి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ ప్రథమ ఉత్తమ పాత్రికేయుడు అవార్డు పొందారు. పసుపులేటి శంకర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా ఎంపిక కావడంతో మండలంలోని ప్రజలే కాక నియోజకవర్గ పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన శిల్పాకు అభినందనలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో మదనపల్లెకు చెందిన విద్యార్థిని సి.శిల్పా 991 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించి రికార్డు సృష్టించడం గర్వంగా వుందని విజయభారతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ కరస్పాండెట్ డాక్టర్ ఎన్.సేతు పేర్కొన్నారు. జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన సి.శిల్పా రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించారు. విజయభారతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ పూర్వ విద్యార్థి అయిన సి.శిల్పా అత్యధిక మార్కులు సాదించి మదనపల్లె ఖ్యాతిని నిలపడం జరిగిందన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వైసిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

రోడ్డు ప్రమాదంలో వైసిపి నాయకుడు మృతి చెందిన సంఘటన మండలంలో వెలుగు చూసింది. కుటుంబీకుల కథనం మేరకు.. కోసవారిపల్లి పంచాయతీ జొన్న చేను పల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి(50) వ్యాపార రీత్యా తంబళ్లపల్లెలో స్థిరపడ్డాడు. ఇట్నేనివారిపల్లెలో తెలిసిన వ్యక్తి అనారోగ్య బారిన పడడంతో వారిని తన సొంత బులోరో వాహనంలో తిరుపతికి తీసుకెళ్లి ఆసుపత్రిలో చేర్చారు. రాత్రి సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా వాల్మీకిపురం మండలం చింతపర్తి సమీపంలో వాహనం అదుపు తప్పి చింత చెట్టుకు ఢీకొంది. ఈ ఘటనలో సుధాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం స్థానికులు గుర్తించి 108 సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లేసరికి ఆయన మృతి చెందాడు మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చి పోస్టుమార్టం అనంతరం మీ కుటుంబీకులకు అప్పగించారు. మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు మృత దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మృతి చెందిన సుధాకర్‌రెడ్డి

నాటుసారా విక్రయిస్తే చర్యలు

వాల్మీకిపురం : అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ శివసాగర్, సివిల్ ఎస్ఐ నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎగువమేకలవారిపల్లిలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 400 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా తయారీ, విక్రయాలు చేయడం నేరమని, స్వచ్ఛందంగా సారా తయారీ, విక్రయాలు మానేసి, ఉపాధి హామి పనులు, కూలి పనులు చేసుకోవాలని సూచించారు. నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తూ పట్టుబడితే పిడి యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని, తద్వారా మీ భవిష్యత్తుతో పాటు కుటుంబం కూడా రోడ్డున పాడాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.